
# మనం

కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు

బుధవారం | 29 |అక్టోబర్ | 2025 | పేజీలు:8



## సీఎంని కలిసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



2 లో



ఇప్పటి వరకు ఆధాలున్నాయని ప్రకటించని దర్యాప్తు సంస్థలు..

తనను అరెస్టు చేస్తే గౌడ సామాజిక వర్గం నేతలు ఊరుకోరంటూ దర్యాప్తు సంస్థలకు జోగి హెచ్చరికలు...

తనను తాను రంగా అనుచరుడిగా పేర్కొంటున్న జోగి...

-ఇబ్రహీంపట్నం, మనం న్యూస్

వివరాలు లోపలిలో...

# ఎవరికీ లేని ఉలుకు జోగికే ఎందుకో..?



## అన్ని సౌకర్యాలతో పునరావాస కేంద్రాలు

ఆహార నాణ్యత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టండి

పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



2 లో

## తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది

రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర

3 లో



# రుతువులు మారుతున్న సమయంలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడం ఎలా?



**గాంధీనగర్ అక్టోబర్ 28 మనం న్యూస్:** రుతువులు మారినప్పుడల్లా, మన ఆరోగ్యంపై వాటి ప్రభావం కూడా మారుతుంది. ఉష్ణోగ్రతలలో హెచ్చుతగ్గులు, అలర్జీ కారకాల బారిన ఎక్కువగా పడటం, రోజువారీ దినచర్యలో మార్పులు... ఇవన్నీ మన రోగనిరోధక వ్యవస్థపై భారాన్ని పెంచుతాయి. దీనివల్ల మనం జలుబు, ఫ్లూ, అలసట బారిన సులభంగా పడే అవకాశం ఉంది. న్యూఢిల్లీలోని మ్యాక్స్ హెల్త్కేర్లో రీజినల్ హెడ్ ఆఫ్ డైటెటిక్స్, న్యూట్రిషనిస్ట్ రితక సమద్దార్ ప్రకారం.. బలమైన రోగనిరోధక వ్యవస్థకు సమతుల్య ఆహారం, మంచి అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలి ఆధారం. బాదం, ఆకుకూరలు, కొవ్వు ఉండే చేపలు వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని చేర్చుకోవాలి. అలాగే, శరీర సహజ రక్షణ వ్యవస్థను బలంగా ఉంచడానికి తేలికపాటి వ్యాయామం చేయాలి. ఇందుకు మీ దినచర్యలో సులభంగా, ప్రభావవంతంగా చేర్చుకోగలిగేది కాలిఫోర్నియా బాదం. ఇది చిన్న గింజ అయినా, రోగనిరోధక శక్తికి పెద్ద ప్రయోజనాలను అందిస్తుంది. కాలిఫోర్నియా బాదంలో విటమిన్ ఇ, జింక్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థకు ఒక కవచంలా పనిచేస్తాయి.

# ఏఐ విప్లవానికి నాయకత్వం వహించిన సామ్సంగ్




**గాంధీనగర్ అక్టోబర్ 28 మనం న్యూస్:** భారతదేశ అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్ సంగ్, ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2025లో 'అందరికీ ఏఐ' అనే తన దార్శనికత ద్వారా ప్రజలు ఎలా జీవిస్తారు, కనెక్ట్ అవుతారు, ఆవిష్కరణలు ఎలా చేస్తారో పునర్నిర్వచించుకుంటోంది. 'ఇన్నోవేట్ టు ట్రాన్స్ఫార్మ్' అనే థీమ్తో కలిసి, ఐఎంసీ 2025లో సామ్సంగ్ ప్రదర్శన ఏఐ ఆధారిత జీవనం, సుస్థిర కనెక్టివిటీ భవిష్యత్తుకు జీవంపోస్తుంది. కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖగుప్తా వంటి వినియోగదారులు, ప్రముఖుల నుండి సామ్సంగ్ బూత్ కు అత్యున్నత స్పందన లభించింది. సామ్సంగ్ సౌత్ వెస్ట్ ఆసియా ప్రెసిడెంట్, సీఈఓ జేబీ పార్క్ అతిథులను స్వాగతించి, వారికి సామ్సంగ్తాజా ఏఐ నేతృత్వంలోని ఆవిష్కరణలను ప్రదర్శించారు.

# ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులు



**ఉయ్యూరు అక్టోబర్ 28 (మనం న్యూస్):** ఉయ్యూరు పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో బిస్మిల్లా హోటల్ ఎదురుగా ఉన్న భారీ చెట్టు రోడ్డుపై అడ్డంగా పడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం తెలుసుకున్న ఉయ్యూరు సీఐ రామారావు , మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ , కమిషనర్ రామారావు సహాయక చర్యలు ప్రారంభించారు .

# జగ్గయ్యపేటలో జాయింట్ కలెక్టర్ పర్యటన

## పలు ప్రాంతాల పరిశీలన, అధికారులతో సమీక్ష



**జగ్గయ్యపేట అక్టోబర్ 28 మనం న్యూస్:** మొంథా తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ జగ్గయ్యపేటలో విస్తృతంగా పర్యటించారు. మంగళవారం పట్టణానికి విచ్చేసిన జాయింట్ కలెక్టర్ ఇలక్కీయ పట్టణంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మార్కెట్ యార్డులో రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి రైతుల తో ముచ్చటించారు. పట్టణంలోని సెల్ టవర్స్ ను ఆమె పరిశీలించారు .అలానే ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి గర్భిణీల కోసం అత్యవసరమైతే చేసిన ఏర్పాట్లను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసిన ఆమె అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్షించారు. అత్యవసర పరిస్థితులలో ఉపయోగించేందుకు ఏర్పాటు చేసిన జెసిబిలను ట్రాక్టర్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం చిల్లకల్లులోని మండల పరిషత్ కార్యాలయంలోనూ అధికారులతో అత్యవసర పరిస్థితులలో తీసుకోవలసిన చర్యల గురించి చేసిన ఏర్పాట్ల గురించి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, జగ్గయ్య పేట తాసిల్దార్ మనోహర్, ఎండిఓ నితిన్, మున్సిపల్ కమిషనర్ తులసి వెంకటకృష్ణ, పట్టణ ఎస్ఐ జి రాజు, తదితర అధికారులు పాల్గొన్నారు.



# అన్ని సౌకర్యాలతో పునరావాస కేంద్రాలు

## ఆహార నాణ్యత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టండి

## పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ




**విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 28 (మనం న్యూస్)** జిల్లాలో ఎక్కడా ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రజా భద్రత, క్షేమమే లక్ష్యంగా తుపాను ప్రతిస్పందన చర్యలు తీసుకున్నామని.. విజయవాడ అర్బన్, గ్రామీణప్రాంతాలతో పాటు నందిగామ, తిరువూరు డివిజన్లలోనూ అన్ని సౌకర్యాలతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మంగళవారం మొంథా తుపానుకు సంబంధించి క్షేత్రస్థాయి తనిఖీల్లో భాగంగా కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ అర్బన్ పరిధిలోని విద్యాధరపురం జీఎన్ఆర్ స్కూల్లోని పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. అప్పటికే ఈ కేంద్రంలో 23 మంది ఉండగా.. వారితో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. అల్పాహారంతో పాటు భోజనం, తాగునీరు, వైద్య సేవలు.. ఇలా ప్రతి విషయంలో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడొద్దని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్యంపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలని.. ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రంలో టీవీ కూడా ఏర్పాటుచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

## జగ్గయ్యపేట నియోజకవర్గానికి నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా 11 కోట్లు నిధులు మంజూరు

## ప్రధానమంత్రి కి, ముఖ్యమంత్రికి, ఆరోగ్యశాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**జగ్గయ్యపేట అక్టోబర్ 28 మనం న్యూస్:** జగ్గయ్యపేట నియోజకవర్గ అభివృద్ధి పట్ల ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధకు నిదర్శనంగా, నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) ద్వారా మొత్తం₹11 కోట్లు నిధులు మంజూరయ్యాయి అని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూఈ నిధులతో జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ నాలుగు మండలాలలో 17 కొత్త విలేజ్ హెల్త్ క్లినిక్స్₹36 లక్షలు చొప్పున ఏర్పాటు చేయబడనున్నాయి. పీఎం ఏ బి హెచ్ ఐ ఎంపథకం కింద జగ్గయ్యపేట (బూధవాడ), పెనుగంచిప్రోలు (నవాబుపేట) ప్రాంతాలకు ₹55 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి అంతేకాకుండా, నాలుగు మండలాలలో అసం పూర్తిగా ఉన్న 18 భవనాల పూర్తి పనులకు కూడా నిధులు కేటాయించబడ్డాయి అని వివరించారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ నిధులు మంజూరవ్వడం ఆనం దదాయకం. ఇందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఆరోగ్యశాఖ మం త్రి సత్యకుమార్ యాదవ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని తెలిపారు.

# శేషం ప్రసాద్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సామినేని ఉదయభాను




**జగ్గయ్యపేట అక్టోబర్ 28 మనం న్యూస్ :** సీనియర్ నేత శేషం ప్రసాద్ జన్మదిన సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం పట్టణంలోని సామినేని ఉదయభాను నివాసంలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో సామినేని ఉదయభాను,శేషం ప్రసాద్ కు మిఠాయిలను తినిపించి ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు సామినేని రాము, కటారి హరిబాబు, ఆవాల భవాని ప్రసాద్, మున్సిపల్ కో ఆప్షన్స్ సభ్యులు ఖాదర్ బాబు తదితర నేతలు పాల్గొన్నారు. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన గొర్రెపాటి రవికుమార్ నూతనంగా కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనాన్ని సామినేని ఉదయభాను లాంచనంగా ప్రారంభించారు.

## కాంట్రాక్టర్ తిరుమలరావును పరామర్శించిన సామినేని

జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ తుళ్లూరు తిరుమలరావు ఇటీవల అనారోగ్యంతో శస్త్రచి కిత్స చేయించుకొని ఇంటికి వచ్చారన్న విషయం తెలుసుకొని ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను తిరుమల రావు ను పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు .ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నేతలు పాల్గొన్నారు.

# ఎంతటి విపత్తు నైనా ఎదుర్కొనేందుకు సర్వం సన్నద్ధం



## మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర

**జగ్గయ్యపేట అక్టోబర్ 28 మనం న్యూస్ :** మోంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పట్టణంలో ఎలాంటి విపత్తునైన ఎదుర్కొనేందుకు సర్వం సన్నద్ధంగా ఉన్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. శాసనసభ్యుల శ్రీరామ్ రాజగోపాల్ సూచనలు తో జిల్లా అధికారుల ఆదేశాలతో పట్టణంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని ,అలానే అత్యవసర పరిస్థితుల్లో ఎదుర్కొనేందుకు నిత్యవసర వస్తువులను, పిల్లలకు పాల ప్యాకెట్లను సైతం సిద్ధం చేసినట్టు తెలిపారు. పట్టణంలో శిథిలావస్థకు చేరిన ఏడు ఇళ్లను గుర్తించి ఆ ఇళ్లలో నివసించే వారికిని హెచ్చరించి సురక్షిత ప్రాంతానికి తరలించి నట్లుగా చైర్మన్ రాఘవేంద్ర వివరించారు. అలానే చెరువుకు , వాగులకు సమీపంలో ఉన్న ప్రాంతాలను పరిశీలించి ఆ ఇళ్లలో నివసించే వారికి హెచ్చరికలను జారీ చేసినట్టు తెలిపారు. అలానే చెట్లు ఏమన్నా కూలిన తొల గించేందుకు జెసిబి లను, ట్రాక్టర్లను సిద్ధం చేశామని మున్సిపల్ సిబ్బందిని సైతం అప్రమత్తం చేసినట్టు తెలిపారు. పట్టణంలో ప్రభుత్వ సూచనల మేరకు శాసనసభ్యులు రాజగోపాల్ ఆదేశాల మేరకు అన్ని ముందస్తు చర్యలను చేపట్టినట్లు చైర్మన్ రాఘవేంద్ర తెలిపారు.

# ఆర్థిక సహాయాన్ని అందజేసిన వైఎస్ఆర్ పార్టీ కార్యకర్తలు



**పెనమలూరు అక్టోబర్ 28 (మనం న్యూస్):** పోరంకి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిపాక రవి తల్లి మరణానికి సంతాపం తెలియజేసి పార్టీ కార్యకర్తల ద్వారా ఆర్థికంగా సహాయం అందజేసిన పెనమలూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి తమ పార్టీ కార్యకర్తల ద్వారా రూ 10,000లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోరంకి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ పార్టీ నాయకులు ప్రతివాడ రాఘవరావు , వేమూరి బాలకృష్ణ , అద్దేపల్లి చందు, నల్లమోతు జీవన్ పాల్గొన్నారు.




## తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది

### రాష్ట్ర కార్మికులు, మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం అక్టోబర్ 28(మనం న్యూస్):** మంగళవారం ఉదయం జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు, రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి మచిలీపట్నం మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ గిరిపురంలో మండల పరిషత్ పాఠశాల లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడి ప్రజలతో అందరూ బాగున్నారా అని వారు విచారించారు. అనంతరం మంగినపూడి బీచ్ ను సందర్శించి అక్కడ ఎగిసిపడుతున్న అలలను, బలమైన ఈదురుగాలులను పరిశీలించారు. అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మోంత తుఫాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం అంతా పూర్తిగా ఏర్పాట్లు చేసిందన్నారు.జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, ప్రమాదాలు ప్రాంతాల నుండి ప్రజలను తరలించేందుకు 222 సురక్షిత పునరావాస కేంద్రాలను గుర్తించామన్నారు. అందులో అవసరాన్ని బట్టి 162 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.అందులో ప్రస్తుతం ఉన్న 2,497 కుటుంబాలకు కావలసిన మంచినీరు, ఆహారము తదితర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.జిల్లాలో రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని అందులో ఒకటి మచిలీపట్నం రెండవది గుడివాడలో ఉన్నాయన్నారు. అలాగే నావికాదళం, సైనిక దళం సేవలను కూడా అవసరమైన పక్షంలో వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.రెవెన్యూ, పోలీసు, విద్యుత్తు తదితర అన్ని ప్రభుత్వ శాఖలు తుఫాను సహాయక చర్యలు చేపట్టేందుకు చాలా అప్రమత్తంగా ఉన్నారన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినకుండా మొబైల్ నెట్వర్క్ సంబంధించి అదనంగా జనరేటర్లు ఏర్పాటు చేసామన్నారు. అలాగే అన్ని పునరావాస కేంద్రాల్లోనూ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన మందులను అందుబాటులో ఉంచామన్నారు.వాతావరణ శాఖ ప్రకటించిన తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యార్థులందరికీ సెలవులు ప్రకటించామని వారితో పాటు ప్రజలందరూ కూడా బయటకు రాకుండా సురక్షితంగా వారి ఇండ్లలోనే జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని సహకరించాలన్నారు. మంత్రివర్యులు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి వాయుగుండంగా మారి తీవ్రమైన తుఫానుగా రూపాంతరం చెందిందన్నారు. ఈరోజు రాత్రికి మచిలీపట్నం కాకినాడ మధ్యలో మోంత తుఫాను తీరం దాటనుందన్నారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు సజావుగా చేశామన్నారు. జిల్లాలో గత రెండు మూడు రోజులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ తుఫాను రాబోతుందని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరడం జరుగుతున్నదన్నారు.రెవెన్యూ, పోలీసు తదితర అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో తుఫాను ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.జిల్లాకు రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వచ్చాయని ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా కాపాడేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్నారు.లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా వారి కోసం జిల్లాలో 200 పైగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, వారికి మంచినీరు, ఆహారము తదితర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.ప్రజలకు మంచినీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా జనరేటర్ ఏర్పాటు చేసి మంచినీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మచిలీపట్నంలో ఈరోజు ఇప్పటివరకు 21 మిల్లీమీటర్ల వర్షం కురిసిందన్నారు. వర్షపాతం ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఈదురుగాలులు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వీస్తున్నాయని, ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు సముద్రం ఉధృతంగా ఉందన్నారు.చెట్లు, గోడలు పడిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ప్రాణ నష్టం జరగకుండా అక్కడి ప్రజలను యుద్ధ ప్రాతిపదికన సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామన్నారు.నగరంలో మురికి కాలువలో పూడికలు తీయడంతో పాటు ఆక్రమణలు తొలగించడం వలన కొంత మేరకు వరద నీరు ప్రవాహం సజావుగా సాగుతుందన్నారు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ మోంత తుఫాను వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చాలా అప్రమత్తంగా ఉంటూ అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుందన్నారు.ప్రమాదం జరిగే ప్రదేశాలను ముందుగానే గుర్తించి అక్కడి ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకునీ సహకరించాలన్నారు. ఈ పర్యటనలో మంత్రులు వెంట మచిలీపట్నం డివిజన్ ఇంచార్జ్ గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, ఎంపీడీవో వెంకటేశు, తహసిల్దారు నాగభూషణం మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు తదితర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

## మొంత తుఫాను వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగద్దు

### రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది

### రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం అక్టోబర్ 28:(మనం న్యూస్):** మంగళవారం ఉదయం మంత్రివర్యులు మచిలీపట్నం మండలంలోని సుల్తానగరం గోల్ కన్వెన్షన్ హాల్ , 50 వ డివిజన్లోని నారాయణపురంలోనీ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ మోటార్లతో మురికి కాలువలోని నీటిని పక్కనున్న చెరువులోకి తోడే కార్యక్రమాన్ని మంత్రి పరిశీలించారు. సుల్తానగరంలో మంత్రి మురుగునీటి వ్యవస్థను పరిశీలించారు. అనంతరం 50 వ డివిజన్ నారాయణపురంలోనీ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్నీ అక్కడే పై భవనం లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. మంత్రి డివిజన్లోని వీధులన్నీ కాలినడకన వర్షపు నీటిలోనే తిరిగి అక్కడి ప్రజలతో మమేకమై వారు ఎలా ఉన్నారంటూ వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్లో మురికి కాలువలు వర్షపు నీటితో నిండిపోయి పొంగి రోడ్డుపైనా నిలిచిపోవడం మంత్రి గమనించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ రహదారి ఎత్తు తగ్గడంతో వర్షపు నీరు ఇండ్లలోకి వస్తుందని, మోకాటి లోతులో నీరు ఉందని, పిల్లలు జ్వరాలు జబ్బులతో చాలా ఇబ్బంది పడుతున్నామని, కొందరు ఇల్లు మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి వెంటనే స్పందిస్తూ వారు ఎలాగున్నారు అని తెలుసుకోవడానికి తాను వచ్చానని అంటూ వారి ఇబ్బందులను తొలగించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నారాయణపురంలోనే సుందరయ్య భవన్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని, అక్కడ ప్రజలకు ఆహారము మంచినీరు తదితర సౌకర్యాలతో పాటు ఉచిత వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేశామన్నారు. శిబిరాన్ని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మచిలీపట్నం నగరంలోని 40, 42, 50 డివిజన్లో, శివగంగ ప్రాంతంలో వర్షపు నీరు నిలిచి ప్రజలు కొంత ఇబ్బంది పడుతున్నారు. వర్షపు నీటిని తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేసి బయటకు దూరంగా మళ్ళిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మచిలీపట్నం నియోజకవర్గంలో 18 సహాయక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో దక్షిణంలో 11, ఉత్తరంలో 7 సురక్షిత పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంకా అవసరమైతే అదనంగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆ కేంద్రాల్లో మంచినీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలతో పాటు వారికి కావలసిన మంచి ఆహారం అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఉచితంగా వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశామని, జ్వరము, జలుబు, దగ్గు తదితర అవసరమైన మందులను అందుబాటులో ఉంచామన్నారు. రెవిన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉన్నారని ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనించుకుంటూ తగిన విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. నారాయణపురంలో సుందరయ్య భవన్ లోని వార్డు సచివాలయంలోనే పునరావాస సహాయక శిబిరాన్ని, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఎవరైనా సరే ఇబ్బంది పడకుండా ఆ శిబిరంలో సురక్షితంగా ఉండి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా మునిసిపల్ కార్మికులతో ఎప్పటికప్పుడు పారిశుధ్యం ఏర్పాట్లు చేయిస్తున్నామన్నారు. ఇటీవల మురికి కాలువల్లో పూడికలు తీయడంతో పాటు ఆక్రమణలు కూడా తొలగించడం వలన వర్షపు నీటి పారుదల సాఫీగా జరుగుతుందన్నారు. ప్రస్తుతం 13 కోట్ల రూపాయలతో మురికినీటి వ్యవస్థను బాగుపరుస్తున్నామని మరో 60 కోట్ల రూపాయలు కూడా మురుగునీటి వ్యవస్థ మెరుగుపరిచేందుకు ఖర్చు చేస్తున్నామన్నారు.మచిలీపట్నం నగరంలో మురుగునీటి సమస్య లేకుండా శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రజారోగ్య శాఖ ద్వారా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామన్నారు

## తుఫాన్ బాధితుల పునరావసు కేంద్రాన్ని పరిశీలించిన జనసేన ఇంచార్జ్ సురేష్

**పామర్రు అక్టోబర్ 28 (మనం న్యూస్):** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పామరు జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ అధికారులతో తుఫాను బాధితులకు అందించే వసతుల గురించి తెలుసుకున్నారు. పునరావసు కేంద్రంలో ఉన్న బాధితులకు భోజనాన్ని వడ్డించి పునరావసు కేంద్రంలోని బాధితులను కలుసుకొని ప్రభుత్వం ఏర్పాట్లను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరూ కూడా పవన్ కళ్యాణ్ చెప్పినట్లుగా ధైర్యంగా ఈ తుఫాను ఎదుర్కోవాలని, ఎవరూ కూడా భయపడవలసిన అవసరం లేదని ధైర్యంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా పునరావసు కేంద్రాల్లో ఉన్న ప్రజలందరికీ నేను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, అదేవిధంగా అధికారులు కూడా మీకు అందుబాటులో ఉండి, అప్రమత్తంగా ఉండి మీకు కావాల్సిన వైద్య అధికారులు అందుబాటులో ఉండి వైద్యం, మందులు అందిస్తారని ఆయన తెలియజేశారు.




## వానలో సైతం సహాయ చర్యలు చేపట్టిన లంక లితీష్

### మోంథా తుఫాను నేపథ్యంలో రెండో రోజు కొనసాగిస్తున్న ముందస్తు జాగ్రత్త చర్యలు.




**మైలవరం అక్టోబరు 28 మనం న్యూస్:** మోంథా తుఫాన్ వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ ఆధ్వర్యంలో రెండో రోజు పట్టణంలో హరిజన వాడ వద్ద కాలువ ప్రమాదకారం గా వున్నది అని తీయజేసిన వెంటనే స్పందించి వానలో సైతం సహాయ చర్య చేస్తూ కాలువల పూడిక తీతలు తీస్తూ, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కార్యకర్తలు తెలుగు యువత పాల్గొన్నారు.

## ఉయ్యూరులో కమ్ముకుంటున్న తుఫాను మేఘాలు, పెరిగిన గాలుల ఉధృతి

**ఉయ్యూరు అక్టోబర్ 28 (మనం న్యూస్):** ఉయ్యూరు పట్టణ మండల ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన అత్యధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉయ్యూరు సీఐ టీవివి రామారావు హెచ్చరించారు. ఇప్పటికే బలహీనంగా ఉన్న గృహాల వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందని, ఇంకెవరికైనా అనుమానం ఉంటే వెంటనే ఉయ్యూరులో జడ్పీహెచ్ స్కూల్, వి ఆర్ కె యం స్కూల్, ఉర్దూ స్కూల్ ఇంకా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని, ఏదైనా సహాయానికి వెంటనే పట్టణ కంట్రోల్ రూమ్ నెంబర్ 08676 232565 ను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

## ప్రజలకు దుప్పట్లు, అల్పాహారం అందజేత



**ఉయ్యూరు, అక్టోబరు 28 (మనం న్యూస్):** మొంథా తుపాను నేపథ్యంలో ఉయ్యూరు, మండల పరిధిలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీనాయకులు మంగళవారం పరిశీలించారు. పునరావాసకేంద్రాల్లో వసతులు, భోజనం ఏర్పాట్లను తహసీల్దార్ సురుశ్ కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు, ఇతర అధికారులు పరిశీలించారు. ఉయ్యూరులో 3 మండల పరిధి గ్రామాల్లో 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి గుడిసెలు, పాకలు, శిధిలావస్థ లోఉన్న ఇళ్లలో నివసించేవారిని అధికారులు, నాయకులు తరలించారు. పునరావాస కేం ద్రాల్లో షుమారు ఏడు వందల మందిని తరలించినట్టు తహసీల్దార్ తెలిపారు.

### దుప్పట్లు, అల్పాహారం పంపిణీ

ముదునూరు పాఠశాలలో పునరావాస కేంద్రంను పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు పాలడుగు సత్యనారాయణ సందర్శించి గిరిజన కుటుంబాలకు దుప్పట్లు, ఇతరులకు అల్పాహారం పంపిణీచేశారు. ఈసందర్భంగా పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి వసతులు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులతో మాట్లాడుతూ పునరావాసకేం ద్రాలకు అవసరమైతే తనవంతు సహాయ సహకారం అందిస్తానన్నారు. మాజీ సర్పంచ్ లు జ్ఞానశేఖర్, పల్లపోతు శ్రీనివాసరావు, ఏసుబాబు, డెక్కాసుబ్రమణ్యం తదితరులు పునరావాస కేంద్రాలను పరిశీలించారు. శాయిపురంలో పునరావాస కేంద్రాన్ని సర్పంచ్ జానాభాషా సందర్శించి ఆహారం, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# మైనర్ బాలిక పట్ల అసభ్యకరముగా ప్రవర్తించిన కేసులో నిందితునకు కఠిన కారాగార జైలు శిక్ష

**పెనమలూరు అక్టోబర్ 28 (మనం న్యూస్ ):** కృష్ణా జిల్లా పెనమలూరు పోలీస్ స్టేషన్లో పరిధిలో నమోదైన కేసు నెమ్మ 674/2018 ,354(ఏ),506 ఐపీసీ సెక్షన్9(ఎం)10 ఆఫ్ పాక్సా చట్ట ప్రకారం కేసులో నిందితుడైన సయ్యద్ కరిముల్లా తండ్రి ఖాదర్, కానూరు గ్రామం పెనమలూరు మండలం వారిపై కోర్టు నందు నేరం ఋజువైనందున ఈరోజున జడ్జి వి భవానీ పోక్సో చట్టం కిందనిందితునికి సెక్షన్9(ఎం) ప్రకారం క్రింద 5 సం. లు జైలు శిక్ష మరియు 5000/- జరిమానా, ఆదేవిధముగా, సెక్షన్ 354 క్రింద ఐపీసీ ప్రకారం 3 సం. లు జైలు శిక్ష మరియు 5000/- జరిమానా ఏక కాలములో అనుభవించే విధముగా, ఒక వేళ జరిమానా కట్టనిచో అదనముగా ఒక నెల జైలు శిక్ష అనుభవించే విధముగా తీర్పు ఇవ్వడం జరిగింది.మహిళలు, చిన్నారుల విషయంలో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై లైంగిక దాడికి తెగబడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పడానికి ఈ తీర్పు ఒక ఉదాహరణ అని , మహిళలు,చిన్నారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నాయుడు హెచ్చరించారు.



## కూరగాయల పంపిణీ

**ఉయ్యూరు అక్టోబరు 28 (మనం న్యూస్):** మొంథా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఉయ్యూరులో కూరగాయల కొరత నేపధ్యంలో టీడీపీ యువనాయకుడు బోడె వెంకట్రామ్ ఆధ్వర్యంలో మంగళవారం పలు ప్రాంతాల్లో ప్రజలకు కూరగాయలు పంపిణీచేశారు. ఈసందర్భంగా పట్టణంలో పునరావాస కేంద్రాల్లో ఉన్నవారిని వివరాలు అడిగితెలుసుకుని ఏర్పాట్లపై ఆరా తీశారు. తుపాను నేపథ్యంలో అప్రమత్తతగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఉయ్యూ రు పీఏసీఎస్ అధ్యక్షుడు కూనపరెడ్డి వాసు పాల్గొన్నారు. గురజాడ డొంకలో పాకల్లో నివసిస్తున్న వారిని పార్టీనాయకుడు చిరంజీవి పునరావాస కేంద్రానికి తరలించారు. తుపాను పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని, తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు రావాలని సీఐ రామారావు హెచ్చరికలు చేశారు. పాకలు, గుడిసెల్లో ఉన్నవారు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు.

### వదంతులతో పునరావాస కేంద్రాలకు పరుగులు

పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి ప్రభుత్వం రూ.3వేలు, బియ్యం ఇస్తుందన్న పుకార్లు షికారు చేయడంతో పక్కా గృహాల్లో ఉండేవారు కూడా పునరావాస కేంద్రాలకు వచ్చి మాపేర్లు నమోదుచేసుకోవాలని అక్కడ ఉన్న ఉద్యోగుల వెంటబడ్డా సహాయం అందించాలని ఆదేశాలు లేవని, పుకార్లు నమ్మవద్దని తహసీల్దార్ సురేశకు మార్ వారికి తెలిపారు.

## రైతులందర్నీ అప్రమత్తం చేసిన వ్యవసాయ అధికారిని

**తిరువూరు: అక్టోబర్ 28మనం న్యూస్:** తిరువూరు మండలంలోని గానుగపాడు, చింతలపాడు, రాజుపేట,అక్కపాలెం,రోలుపడి గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించిన మండల వ్యవసాయ అధికారి పి పద్మ ఈ గ్రామాలలో ఉన్న రైతులకు ఇప్పుడున్న ప్రతికూల వాతావరణంలో రైతులందరూ 2-3 రోజులు కోతలు వాయిదా వేసుకోవాలని ఇప్పటికే కోసిన ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచించారుమరియు వ్యవసాయ యంత్ర పరికరాలను జాగ్రత్త పరచుకోవాలని, రైతులెవరూ వ్యవసాయ క్షేత్రాల వద్ద గల చెట్ల దగ్గర,కరెంటు స్తంభాల వద్ద ఉండవద్దని సూచనలు చేస్తూ దయచేసి రైతులు పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించవలసినదిగా కోరారు రైతు సేవా కేంద్రాల సిబ్బంది అందరూ రైతులకు అందుబాటులో ఉన్నారని, తుఫానుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారని తెలియచేశారు.





# ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

### ప్రజలంతా చైతన్యవంతులై అప్రమత్తంగా వ్యవహరించాలి

### మొంథా తుపాను ముందస్తు చర్యలపై మంత్రి నారా లోకేష్



**విజయవాడ సెంట్రల్, అక్టోబర్ 28 (మనం న్యూస్):** మొంథా తుపాను వల్ల రాష్ట్రంలో సుమారు 40లక్షల మంది ప్రజలు ప్రభావితమవుతున్నారు. కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు అత్యధిక తీవ్రత కలిగిన ప్రాంతాలుగా గుర్తించాం. ఆ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఆ జిల్లాలు రెడ్ అలర్ట్ లో ఉన్నాయి. ప్రజాప్రభుత్వం లక్ష్యం ఒక్కటే, ఎటువంటి ప్రాణ నష్టం ఉండకూడదు, ముఖ్యమంత్రి గారి ఆదేశాలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హోంమంత్రి అనితతో కలిసి మంగళవారం సాయంత్రం మంత్రి లోకేష్ విలేకరులతో మాట్లాడుతూ.... తుపాను సహాయ చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. ఒకపక్క డిజాస్టర్ మేనేజర్ మెంట్ మంత్రి అనిత, మరోవైపు ఆర్టీజీఎస్ మంత్రిగా నేను సమన్వయంతో గత 24గంటలుగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. గత ఐదు రోజులుగా మొంథా తుపాను గమనాన్ని పరిశీలిస్తూ తుపాను ప్రభావిత ప్రాంతాలపై దృష్టిసారిస్తున్నాం. మంగళవారం రాత్రి 11.30 గం.లకు అమలాపురం సమీపంలో తుపాను తీరం దాటబోతోంది. ఈ సందర్భంగా 90 నుంచి 100 కి.మీల వేగంతో అక్కడ ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. పరిసర ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది.

### 1906 తాత్కాలిక షెల్టర్ల ఏర్పాటు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 23వ తేదీ నుంచి నేరుగా పర్యవేక్షిస్తున్నారు. యుఏఈకి వెళ్లే ముందు, అక్కడ నుంచి వచ్చిన తర్వాత 12 రివ్యూ మీటింగ్ లు, టెలీ కాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్ ల ద్వారా తుపాను పరిస్థితులపై సమీక్ష చేశారు. ప్రధాని నరేంద్రమోడీ గారు సీఎంతో మాట్లాడి ముందస్తు ఏర్పాట్లపై వాకబు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రియల్ టైమ్ రిపోర్టులు పంపించింది. రాష్ట్రానికి ఏం కావాలన్నా సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రధానమంత్రి చెప్పారు. తుపాను ప్రభావం, ముంపు తీవ్రత అధికంగా ఉండే 1,328 గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాం. 3,465 గర్భిణీలను తరలించి, వారికి కావాల్సిన పౌష్టికాహారం, నిత్యావసరాలను అందజేస్తున్నాం. 1,906 తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటుచేసి పునరావాసానికి అవసరమైన సామగ్రి అంతా పంపించాం. శానిటేషన్ కు అవసరమైన బ్లీచింగ్ పౌడర్, లైమ్, ఇతర సామగ్రిని ఆయా గ్రామాలకు చేరవేశాం.

### ఎన్ డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం.

14,798 పాఠశాలలకు సెలవులు ప్రకటించాం, 364 స్కూళ్లను పునరావాస కేంద్రాలుగా మార్చాం. ఈ నెల 29వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీచేసి, నిషేదాజ్ఞలు విధించాం. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యల కోసం 11 ఎన్ డీఆర్ఎఫ్, 12 ఎస్ డీఆర్ ఎఫ్ టీమ్ లు, రిజర్వ్ టీమ్ లు కూడా సిద్ధంగా ఉన్నాయి. అవసరమైతే రావడానికి ఆర్మీ కూడా హైదరాబాద్ లో సిద్ధంగా ఉన్నారు. 145 ఉడ్ కటింగ్ టీమ్స్ సిద్ధంగా ఉన్నారు, ఇప్పటికే విశాఖపట్నం, తదితర ప్రాంతాల్లో చెట్లు పడిపోయిన చోట వారు సేవలందిస్తున్నారు. మెడికల్ అండ్ హెల్త్ కు సంబంధించి 325 శిబిరాలు సిద్ధం చేశాం, 876 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ కూడా రెడీగా ఉన్నాయి.

### సహాయ చర్యలపై ముందస్తు ఏర్పాట్లు.

తుపాను తీరం దాటిన తర్వాత పునరుద్ధరణ కార్యక్రమాలు చాలా కీలకం. ముఖ్యంగా విద్యుత్ శాఖకు సంబంధించి 11,347 స్తంభాలు, 1210 ట్రాన్స్ ఫార్మర్లు రెడీ చేశాం. సైక్లోన్ డైరెక్షన్ ను బట్టి సేవలందించేందుకు 772 రిస్టోరేషన్ టీమ్స్ ను కూడా సిద్ధంగా ఉంచాం. హాస్పటల్స్ కు కూడా ఎటువంటి అంతరాయం లేకుండా యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఎక్కడైన రోడ్లు కోతకు గురైతే వెంటనే పునరుద్ధరించి, ట్రాఫిక్ కు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఆర్ అండ్ బి శాఖకు సంబంధించి 7,289 జేసీబీ, క్రేన్స్, వాహనాలు సిద్ధంగా ఉంచాం. తాగునీటికి సంబంధించి వాటర్ ట్యాంకర్లను రెడీ చేశాం. తుపాను సమయంలో ప్రధానంగా ప్రభావితమయ్యేది సీపీ డబ్ల్యూ స్కీమ్స్. తిత్లీ అనుభవాలతో ముందస్తు చర్యలు తీసుకున్నాం. ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో పక్కాగా చర్యలు చేపట్టి 1,037 డీజిల్ జనరేటర్లను ఆయా ప్రాంతాలకు పంపించాం. ఎయిర్ టెల్, జియో, ఇతర సర్వీసు ప్రొవైడర్లు సెల్ ఫోన్ టవర్లకు అవసరమైన డీజి సెట్లు సిద్ధం చేశారు, డీజిల్ కూడా అందుబాటులో ఉంచాం.

### రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తున్నాం

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యల కోసం కలెక్టర్లందరికీ నిధులు విడుదల చేశాం. ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ప్రధాన లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఆర్టీజీఎస్ లో రాత్రంతా బసచేసి రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తాం. ముఖ్యమంత్రిగారు ప్రతి 2గంటలకు ఒకసారి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మొంథా తుపాను తీరందాటాక వెనువెంటనే డ్రోన్స్, లోలెవల్ ఫ్లయింగ్ వెహికల్స్ తో పంట నష్టం, ఇళ్లు, ఆస్తి నష్టంపై రియల్ టైమ్ ట్రాకింగ్ పెట్టి యుద్ధప్రాతిపదికన సహాయ, పునరావాస చర్యలు ప్రారంభిస్తాం. ప్రభుత్వం ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. దయచేసి ప్రజలంతా ఇళ్లలోనే ఉండండి. బీచ్ లు, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దు. అధికారులు చెప్పిన జాగ్రత్తలు పాటించండి. 100 కి.మీ.ల వేగంతో తుపాను వస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బంది పడతాం. ఈ సమయంలో బీచ్ ల దగ్గరకు వెళ్లడం మంచిది కాదు. ఈ రాత్రి 11.30 గంటల నుంచి పరిస్థితి చాలా క్రిటికల్ గా ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్నిచోట్ల భారీవర్షాలు పడుతున్నాయి. తీరం దాటాక కూడా భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

### ప్రజాప్రతినిధులంతా క్షేత్రస్థాయిలోనే.

మంగళవారం ఉదయం హోంమంత్రి, నేను ఎమ్మెల్యేలు, ఎంపీలతో మాట్లాడాం, వారివద్ద నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నాం. గోపాలపురం ఎమ్మెల్యే ఎర్రకాలువ సమస్య ఉందన్నారు. వెంటనే తగు చర్యలు చేపట్టాం. తుపాను తీరం దాటాక క్షేత్రస్థాయిలో గ్రామాలు, పంటపొలాలకు వెళ్లి సహాయ, పునరావాస చర్యల్లో పాల్గొనాల్సిందిగా ప్రజాప్రతినిధులకు సూచించాం. ఇప్పుడు మా దృష్టి అంతా ప్రజలను చైతన్యవంతం చేసి, అప్రమత్తం చేయడమే. ప్రభుత్వం ఈ నెల 23నుంచే అప్రమత్తంగా ఉంది. ముఖ్యమంత్రిగారు ఇప్పటికి 12సార్లు సమీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజాప్రతినిధులంతా ఫీల్ లోనే ఉన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవితో సహా మంత్రులంతా తుపాను ప్రభావిత ప్రాంతాల్లోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మంత్రులతోపాటు అందరూ అప్రమత్తంగా ఉన్నారు. దీనిని తేలిగ్గా తీసుకోకుండా సీరియస్ గా పనిచేస్తున్నాం.

### ఆర్టీజీఎస్ లో అవేర్ ప్లాట్ ఫాం.


తుపాను తీరం దాటిన తర్వాత యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరిస్తాం. తుపాన్లను ఎదుర్కోవడంలో ముఖ్యమంత్రి గారికి ఎంతో అనుభవం ఉంది. ఆయన 1996 కోనసీమ తుపాను, హుద్ హుద్, తిత్లీ సమయంలో సమర్థవంతమైన సేవలు అందించారు. గత 5 రోజుల నుంచి మేమంతా ప్రిపరేషన్ లో ఉన్నాం. చెట్లు కూలిపోయినపుడు వాటిని తొలగించే వరకు ఫాలో అప్ మెకానిజం ఏర్పాటుచేశాం. హోం మంత్రి మానిటర్ చేస్తున్నారు. 10 నిమిషాల్లో క్లియర్ చేయాలని సీఎం గారు ఆదేశించారు. ప్రజాప్రతినిధులతో నేను మాట్లాడాను. అందరూ సిద్ధంగా, అప్రమత్తంగా ఉన్నారు. ప్రమాదం సంభవించకుండా చాలాప్రాంతాల్లో భారీ ఫ్లెక్సీలు తొలగించాం. తుపానుకు సంబంధించి పూర్తిస్థాయి డేటా మాకు ఎప్పటికపుడు వస్తోంది. ఆర్టీజీఎస్ లో అవేర్ ప్లాట్ ఫాం ఏర్పాటుచేశాం. రియల్ టైమ్ మానిటర్ చేస్తున్నాం. డిజాస్టర్ మేనేజ్ మెంట్, రిలీఫ్, రిహాబిలిటేషన్ ఇంటిగ్రేషన్ చేస్తున్నాం. వాట్సాప్, ఎస్ఎంఎస్, వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

### అన్నిశాఖలూ సర్వసన్నద్ధం.

సహాయ చర్యల్లో ఎక్కడా అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. 99 శాతం కచ్చితత్వంతో మాకు సమాచారం అందుతోంది. రియల్ టైం సమాచారాన్ని, ప్రభుత్వం తీసుకున్న చర్యలు ప్రధాని కార్యాలయానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. ప్రధానిమంత్రి స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. పీఎంఓ వారు కూడా మానిటర్ చేస్తున్నారు. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులంతా తుపాను పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. వివిధ రకాల సోర్స్ ద్వారా డేటా సేకరిస్తున్నాం. శాటిలైట్ మ్యాప్స్ కూడా తీసుకుంటున్నాం. ప్రజలను అప్రమత్తం చేసి చైతన్యం తేవడమే మా లక్ష్యం. ఇది రాజకీయాలకు సమయం కాదు. ప్రజలకు సేవలందించేందుకు అన్నిశాఖలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని మంత్రి నారా లోకేష్ చెప్పారు. విలేకరుల సమావేశంలో హోం మంత్రి అనిత పాల్గొన్నారు.

# వలస కార్మికులను శిబిరాలకు తరలించండి : యార్లగడ్డ

### గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముంపును నివారించాలి



**గన్నవరం : అక్టోబర్ 28( మనం న్యూస్):** తుఫాన్ ముంపు బారిన పడిన ప్రజలతోపాటు ఇతర రాష్ట్రాల వలస కార్మికులను సైతం సహాయ పునరావాస శిబిరాలకు తరలించి వారికి ఆహారాన్ని అందించాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. మెంతా తుఫాను సహాయ కార్యక్రమాలపై మంగళవారం సాయంత్రం గుడివాడ ఆర్డీవో తో పాటు గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల తాసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా తుఫాన్ తీవ్రతను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి పలు సూచనలు ఇచ్చారు. మంగళవారం రాత్రి నుంచి వర్ష తీవ్రత పెరిగే ప్రమాదం ఉన్నందున అధికారులందరు మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని యార్లగడ్డ సూచించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు కు ప్రభుత్వ పాఠశాలలు చాలకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అందుబాటులో ఉన్న ప్రయివేటు భవనాలలో పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గత ఏడాది బుడమేరు ముంపును దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. అప్పట్లో చెరువులు, కాలువలకు గండ్లు పడిన ప్రాంతాలను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలన్నారు. డ్రైనేజీల్లో పూడిక తీయించి వర్షపు నీరు సక్రమంగా పారుదలయ్యేలా చూడాలని ఆదేశించారు. ఏ సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

# అవనిగడ్డలో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలి

### ప్రభుత్వానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విజ్ఞప్తి



**నాగాయలంక,28 అక్టోబర్ (మనం న్యూస్):** తరచూ ప్రకృతి విపత్తులను ఎదుర్కొంటున్న దివిసీమకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు అవనిగడ్డలో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ నాగాయలంక మండలం గుల్లలమోద, సొర్లగొంది, ఏటిమొగ, గణపేశ్వరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. ఆయా శిబిరాల్లో ఉన్న తుఫాన్ బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. తుఫాన్ ప్రభావం తగ్గేవరకూ ఇళ్లకు వెళ్ళవద్దని స్పష్టం చేశారు. అనంతరం నాగాయలంక తహసీల్దార్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ విపత్తుల వేళ ప్రభుత్వం నియమించే ప్రత్యేక అధికారులకు స్థానిక పరిస్థితులపై అవగాహన లేక ఇబ్బంది ఎదురవుతోందన్నారు. స్థానికంగా ఆర్డీఓ ఉంటే ఇక్కడి పరిస్థితులపై అవగాహనతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో సత్వర సేవలు అందుతాయన్నారు. తద్వారా దివిసీమకు అతి పెద్ద మేలు జరుగుతుందన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పునర్విభజన సబ్ కమిటీ దృష్టికి, మంత్రుల దృష్టికి ఈ అంశం తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో పాటు 1977 దివిసీమ ఉప్పెన తరువాత నిర్మించిన తుఫాన్ షెల్టర్లు దాదాపు అన్ని శిథిలావస్థకు చేరిపోయిన నేపథ్యంలో నూతన తుఫాన్ షెల్టర్లు నిర్మించాల్సిన ఆవశ్యకత ప్రభుత్వం గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రకృతి వైపరీత్యాల సంస్థ నుంచి నిధులు తెచ్చి గతంలో తుఫాన్ షెల్టర్లు ఉన్న గ్రామాల్లో మళ్ళీ తుఫాన్ షెల్టర్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. విపత్తుల సమయంలో కీలకంగా నిలిచే డ్రైనేజీ వ్యవస్థ బలోపేతానికి ఔట్ ఫాల్ స్లూయిజులను పెరిగిన సముద్ర మట్టాలకు అనుగుణంగా పునర్ నిర్మించాలని కోరారు. నాగాయలంక మండలంలోని పన్నెండు పునరావాస కేంద్రాల్లో తుఫాన్ బాధితులు ఉన్నట్లు తెలిపారు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనే చంద్రబాబు మొంథా తుఫాన్ పరిస్థితిని ముందస్తు సన్నద్ధతతో ఏర్పాట్లు చేశారన్నారు. గతంలో హుద్ హుద్ తుఫాన్ సమయంలో చంద్రబాబు సేవలకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. తాజాగా వచ్చిన ఈ విపత్తును కూటమి ప్రభుత్వం ఎదుర్కొని ఎలాంటి ప్రాణనష్టం కలుగకుండా చూస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం పునరావాస కేంద్రాలకు నిధులు సక్రమంగా కేటాయించటంతో ప్రభుత్వ అధికారులు మరింత ఉత్సాహంగా తుఫాన్ బాధితులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.

#### పుకార్లు నమ్మవద్దు:

పునరావాస కేంద్రాల్లో ఆధార్ కార్డు తీసుకువెళ్లితే రూ.3వేలు ఇస్తారనే పుకార్లు నమ్మవద్దని స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అన్ని విధాలుగా సహకారం అందించే కూటమి ప్రభుత్వం ప్రతి అంశంపై శ్రద్ధ వహిస్తోందన్నారు. ఈ తుఫాన్ తీవ్రత దృష్ట్యా పునరావాస శిబిరాలకు వచ్చిన వాళ్ళు తుఫాన్ తీవ్రత తగ్గే వరకు శిబిరాల్లోనే ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, టీడీపీ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# మొంథా ను సమర్ధవంతంగా ఎదుర్కొంటాం



**చల్లపల్లి,28 అక్టోబర్ (మనం న్యూస్):** చల్లపల్లిలోని జడ్పీ హైస్కూల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంగళవారం మధ్యాహ్నం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ పరిశీలించారు. తుఫాన్ బాధితులను పరామర్శించారు. గుడారాల్లో నుంచి పునరావాస కేంద్రానికి చేరిన నిరుపేద ఎస్టీలకు ధైర్యం చెప్పారు. తుఫాన్ తగ్గే వరకూ ప్రభుత్వం అండగా ఉంటుందని, శిబిరాల్లోనే ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా శిబిరంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ ఆధ్వర్యంలో 30మందికి ఆహార పొట్లాలను తుఫాన్ బాధితులకు అందచేశారు. మిగిలిన వంద మందికి ప్రభుత్వం ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొంథా తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొంటుందన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ జిల్లాలో తుఫాను సహాయక చీరల కోసం ప్రభుత్వం ఇప్పటికే ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను రంగంలోకి దింపినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ ఆర్ సీ ఆనంద్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, సర్పంచ్ ప

# చల్లపల్లి - మచిలీపట్నం ప్రధాన రహదారిపై నేలకొరిగిన చెట్లు తొలగింపు



**చల్లపల్లి, 28అక్టోబర్ (మనం న్యూస్):** మొంథా తుఫాను ప్రభావంతో చల్లపల్లి - మచిలీపట్నం ప్రధాన రహదారిపై వేరు వేరు ప్రదేశాలలో అయిదు భారీ వృక్షాలు నెలకొరగడంతో రాకపోకలు అంతరాయం కలిగించాయి. సమాచారం అందుకున్న చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఎస్సై సుబ్రహ్మణ్యం వెంటనే స్పందించి స్థానిక ప్రజలు, పంచాయతీ సిబ్బంది, విద్యుత్ శాఖ సిబ్బందిని సమన్వయపరచి చెట్ల తొలగింపు పనులు చేపట్టారు.రాత్రివేళల వరకూ కొనసాగిన చర్యలతో రహదారి మళ్లీ సాధారణ స్థితికి వచ్చింది. వేగంగా స్పందించిన పోలీసు అధికారులపై ప్రజలు ప్రశంసలు కురిపించారు.

# ముంచుకొస్తున్న మొంతా జాగ్రత్త వహించండి


### మున్సిపల్ చైర్మన్ వల్లభనేని



**ఉయ్యూరు అక్టోబర్ 28 (మనం న్యూస్):** ఉయ్యూరు పట్టణ ప్రజలు మొంతా తుఫాను దృష్ట్యా ప్రజలందరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ తెలిపారు నగరంలో కరెంట్ పోతే ప్రజలు కు ఇబ్బంది లేకుండా ఉయ్యూరు లోని ప్రతి వాటర్ ట్యాంక్ దగ్గర జెనరేటర్ ఏర్పాటు చేసి త్రాగునీరు ప్రజలకు ఏర్పాటు చేశామని అన్నారు. ఎప్పటికప్పుడు విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది సమాచారం అందించేలా ఆదేశాలు ఇచ్చామని అన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్ లకు దూరంగా సురక్షితంగా ఉండాలని, ఏమైనా విద్యుత్ స్తంభాలు పడిపోయినా, కరెంట్ వైర్లు తెగిపడిన గాని వాటిని తాకరాదనీ సమాచారం మున్సిపల్ సిబ్బందికి అందివ్వాలని ఆయన కోరారు. విద్యుత్ తీగలపై చెట్లు కానీ చెట్లు కొమ్మలు కానీ పడిన యెడల వెంటనే స్థానిక ప్రజలు సమాచారం ఇవ్వాలని తెలిపారు విద్యుత్ సంబంధించి ఏ సంఘటన జరిగినా వెంటనే మీకు సంబంధించిన, సబ్ స్టేషన్కు , విద్యుత్ సిబ్బందికి సంచారం ఇవ్వాలని లేదా కంట్రోల్ రూమ్ నెంబర్ 1912 కు సమాచారం ఇవ్వవలసిందిగా పట్టణ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# శ్రీకాకుళం జడ్పీ హైస్కూల్లోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన మండలి వెంకట్రామ్

**ఘంటసాల,28 అక్టోబర్ (మనం న్యూస్):** మొంతా తుఫాన్ కారణంగా కృష్ణాజిల్లా ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గారి తనయులు మండలి వెంకట్రామ్ (రాజా) కూటమి నేతలతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి, ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) సహకారంతో పునరావాస కేంద్రంలోని ప్రజలకు ఏర్పాటు చేసిన అల్పాహారం బిస్కెట్ ప్యాకెట్లు, పండ్లను వెంకట్రామ్ పంపిణీ చేశారు. సౌకర్యాల స్థితిగతులు, తాగునీరు, వైద్య సేవలు, అల్పాహారం మరియు భోజనం నాణ్యత గురించి అధికారులను మండలి వెంకట్రామ్ (రాజా) ఆరా తీసారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఉప సర్పంచ్ శీలం శ్రీనివాస్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నాగిని, గ్రామ టీడీపీ అధ్యక్షులు దాసం రామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.



# మొంథా తుఫాను ల్ దృష్ట్యా బిఎస్ఎన్ఎల్ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నిరంతర సేవలు

**విజయవాడ సెంట్రల్ అక్టోబర్ 28( మనం న్యూస్):** వచ్చే మొంతా తుఫాను దృష్ట్యా, బీఎస్ఎన్ఎల్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్, రాష్ట్రవ్యాప్తంగా నిరంతర టెలికాం సేవలు కొనసాగించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టింది.టెలికాం సేవలకు సంబంధించిన ఎలాంటి సమస్యలకైనా స్పందించేందుకు విజయవాడలో 247 కాల్ సెంటర్ను ఏర్పాటు చేశారు. వినియోగదారులు క్రింది నంబర్ల ద్వారా కంట్రోల్ రూమ్ను సంప్రదించవచ్చు: ల్యాండ్లైన్: 0866-2424242, మొబైల్: 9490179300తుఫాను కారణంగా టెలికాం సేవల్లో అంతరాయం కలిగిన సందర్భంలో, బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు పై నంబర్ల ద్వారా తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు.బీఎస్ఎన్ఎల్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ టెలికాం శ్రీ ఎం. శేషాచలం ఐటీఎస్ , బీఎస్ఎన్ఎల్ సేవలు వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కొనసాగుతున్నాయని మరియు మెరుగైన సేవలు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



## ఎటువంటి అపోహలను నమ్మొద్దు

### విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు



**విజయవాడ సెంట్రల్ అక్టోబర్ 28 (మనం న్యూస్)** విజయవాడ బుడమేరు పొంగుతుందని ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికి కొంతమంది ఫెక్ సమాచారాన్ని స్ప్రెడ్ చేస్తున్నారు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మున్నేరు, బుడమేరు మొదలైన అన్నీ వాగులు, కాలువల పరిసర ప్రాంతాలను నిరంతరం డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుంది. ప్రస్తుతం ఎక్కడా ఎటువంటి అలజడులు లేవు. జిల్లా యంత్రాంగం అందరూ అప్రమత్తంగా ఉన్నారు.

## కొండ ప్రాంతాల్లో పర్యటించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు




**విజయవాడ తూర్పు అక్టోబర్ 28 (మనం న్యూస్ )** విజయవాడ సిపిఎం కార్యాలయాల్లో పునరావాస, సహాయ శిబిరాలను ప్రారంభించిన బాబురావు కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాలలో పర్యటించిన నేతలు ఈ సందర్భంగా సిపిఎం నేత బాబూరావు మాట్లాడుతూ. క్రీస్తురాజుపురం సున్నపుబట్టీల సెంటర్ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడి ఇళ్ళు ధ్వంసం అయ్యింది. బారీ స్థాయిలో ఉన్న రాళ్ళు కొండ నుండి విరిగిపడ్డాయి. గత సంవత్సరంలో ఇదే సమయంలో ఈ ప్రాంతంలో కొండ చరియలు విరిగి ఆరుగురు మృతి చెందారు. పది మందికి పైగా గాయపడ్డారు.తుఫాన్ సందర్భంలోనే కాకుండా ఈ ప్రాంతంలో వర్షాలు పడిన ప్రతి సంవత్సరం ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాళ్ళు పై నుండి పడకుండా రక్షణ చర్యలు చేపట్టాలి. కొండప్రాంతంలో పలు ప్రదేశాల్లో వీధి లైట్లు పనిచేయడం లేదు. మెట్ల మార్గం ప్రమాదకరంగా ఉన్న ప్రాంతంలో ఇటువంటి అంతరాయం లేకుండా చూడాలి. ప్రభుత్వం ఇళ్ళు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సచివాలయ అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రజలు పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకుని ఆయా కేంద్రాలకు వెళ్ళాలి. ప్రకృతి విపత్తుల సమయంలో సిపిఎం కార్యాలయాలను పునరావాస కేంద్రాలగా మార్చి ప్రజలకు సేవలు అందిస్తున్నాము. ప్రస్తుత తీవ్ర తుఫాన్ నేపథ్యంలో క్రీస్తు రాజపురం, మొగల్రాజపురం సిపిఎం కార్యాలయాలను ఈ రోజు పునరావాస కేంద్రాలుగా ప్రారంభించడం అయినది. అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాము.విపత్కర పరిస్థితుల్లోనే కాకుండా ప్రభుత్వం, అధికారులు ఇటువంటి సమస్యలను త్వరతగతిన పరిష్కరించే విధముగా చర్యలు చేపట్టాలని కోరారు. జమ్మిచెట్టు సెంటర్ లో ఉన్న బి.ఎస్.ఆర్.కె ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.కాంతి కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు జి.రామన్న, నగర నాయకులు ఎన్. నాగేశ్వరరావు, స్టాలిన్, మురహరి తదితరులు పాల్గొన్నారు.

# ఎవరికీ లేని ఉలుకు జోగికే ఎందుకో....?



### ఇప్పటి వరకు ఆధాలున్నాయని ప్రకటించని దర్యాప్తు సంస్థలు..

### తనను అరెస్టు చేస్తే గౌడ సామాజిక వర్గం నేతలు ఊరుకోరంటూ దర్యాప్తు సంస్థలకు జోగి హెచ్చరికలు...

### తనను తాను రంగా అనుచరుడిగా పేర్కొంటున్న జోగి...

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 28 (మనం న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంచలనం కలిగించిన నకిలీ మద్యం కేసు విచారణ దేవుడెరుగు కానీ ఆలూ లేదు, చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్నాడాట వెనుకటి ఒకాయన. అలాగే ఉంది మాజీ మంత్రి జోగి రమేష్ వ్యవహార శైలి. అదిగో పులి అంటే ఇదిగో తోక అంటూ భయపడుతున్నట్లుంది నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ హడావిడి చూస్తుంటే. నకిలీ మద్యం కేసు వెలుగులోకి వచ్చిన నాటి నుండి జోగి రమేష్ గుమ్మడి కాయల దొంగలు ఎవరు అంటే బుజాలు తడుముకున్నట్లుగా మైలవరంలో మీడియా ప్రతినిధులతో మాజీ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ తనను నకిలీ మద్యం కేసులో ఇరికించే ప్రయత్నాలు తెదేపా చేస్తుందని ఆరోపణలు చేయడం ప్రారంభించారు. అప్పటి నుండి గత సోమవారం విజయవాడలోని ఎంతో పవిత్ర పుణ్య క్షేత్రమైన కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో సత్య ప్రమాణం పేరుతో హైందవ సాంప్రదాయలను, ఆచారాలను మంటగలిపే విదంగా, హిందూ దర్మ శాస్త్రాలకు తనదైన శైలిలో కొత్త నిర్వచనాలను పలుకుతూ హిందువుల మనోభావాలను సైతం లెక్కచేయని స్థితిలో జోగి రమేష్ వ్యవహరించిన తీరు పట్ల దుర్గ గుడిలోని వైదిక కమిటీ సభ్యులు సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. అంటే జోగి రమేష్ సత్య ప్రమాణం పేరుతో చేసిన చర్యలు హింధువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని వారు భావించినట్లు అర్ధమవుతుంది. హైందవ సాంప్రదాయ పరిదిలోని మనుస్మృతి ప్రకారం లేదా ఆగమన శాస్త్రం ప్రకారం చూసినా గానీ జోగి రమేష్ చేసిన ప్రమాణం నిబంధనలకు విరుద్దంగా ఉన్నట్లుగా స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సత్య ప్రమాణం అనంతరం ఆలయ ప్రతిష్టకు బంగం కలిగే విధంగా, రాజకీయ ఉపన్యాసాలకు, ప్రభుత్వ పెద్దలపైన, రాజ్యాంగ బద్దమైన దర్యాప్తు సంస్థలపైన అర్ధం లేని ఆరోపణలు చేస్తూ, ఆవేశంతో ఊగిపోతూ అవసరమైతే ఇక్కడే ఆత్మహత్యకు పాల్పడతానంటూ ఒక పక్కన చంద్రబాబునాయుడిని, మరో పక్క లోకేష్ ను బెదిరిస్తూ, తనను అరెస్టు చేస్తే రాధ, రంగా అభిమానులు, గౌడ సామాజికవర్గం వారు చూస్తూ ఊరుకోరంటూ దర్యాప్తు సంస్థలకు, ప్రభుత్వ పెద్దలకు హెచ్చరికలు జారీ చేస్తూ, రాజకీయ వ్యాఖ్యలు చేయడం ద్వారా దుర్గ గుడి ఔన్నత్యాన్ని, పవిత్రతను దెబ్బతీశారు.

### ఇప్పటి వరకు ఆధారాలున్నాయని ప్రకటించని దర్యాప్తు సంస్థలు..

నకిలీ మద్యం కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ అధికారులతో ప్రత్యేక దర్యప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసి నిజాలను నిగ్గు తేల్చాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో గత పది రోజులకు పైగా సిట్ బృందం వేగవంతంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు కానీ సిఐడి అధికారులు కానీ రాష్ట్ర పోలీసులు కానీ ఇంత వరకు జోగి రమేష్ కు ఎటువంటి నోటీసులు అందజేసినట్లు సమాచారం లేదు. కనీసం మీడియా వేదికగా కూడా దర్యాప్తు సంస్థలు కూడా జోగి రమేష్ గురించి ఎక్కడా ఎటువంటి ప్రకటనలు కూడా చేయలేదు. అయినప్పటికీ తనను అన్యాయంగా నకిలీ కేసులో ఇరికిస్తున్నారంటూ మీడియా సాక్షిగా జోగి గగ్గోలు పెడుతున్నారు. వాస్తవానికి ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ కేంద్రానికి జోగి రమేష్ తన కార్యకర్తలతో కలిసి గుంపుగా వెళ్లి పోలీసులు ఆధారాలు సేకరిస్తున్న సమయంలో వారికి విధి నిర్వహణలో ఆటంకం కలిగించడంతో పాటు ఎటువంటి ఆధారాలు లేకుండానే నారా వారి సారా అంటూ నోటికి ప్రాస బావుందనే కారణంతో సాక్షాత్తూ ముఖ్య మంత్రి పైన ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో అదే కారణంతో పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు ముఖ్య మంత్రి పైన నిరాధార మైన ఆరోపణలు చేశారనే కారణాలతో జోగి పైన ఆనాడు కేసు నమోదు చేశారు.

### వైసిపిలో ఎవరికీ లేని భయం జోగికే ఎందుకు..?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ పార్టీ అధినేతకు అత్యంత సన్నిహిత సంభందాలు కలిగి, పార్టీలో అత్యంత ప్రభావ వంతంగా పని చేస్తున్న నాయకులు అనేకమంది రాష్ట్ర రాజకీయాలలో స్థిరంగా పని చేస్తూ ఉండగా వారిలో ఎవరికీ కలగని భయం, బెరుకు పార్టీ ఇచ్చిన పిలుపును అనుసరించి ఇంటి నుండి రోడ్డు కూడా ఎక్కలేని జోగి పై ఎంతో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు, లోకేష్ లు కలిసి కుట్రలు చేస్తున్నారంటూ జోగి ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందంటూ పలువురు పెదవి విరుస్తున్నారు. నిజంగా కేసులో ఇరికిస్తారనుకుంటే తంబళ్లపల్లిలో ఉన్న వైఎస్సార్ సిపి నాయకులు కూడా భయపడాలి కదా..? కానీ వారు ఎవరూ భయపడడంలేదు. కానీ జోగి రమేష్ మాత్రమే ఆంధోళన చెందడం పట్ల పలువురు విశ్మయం చెందుతున్నారు.

### తనను తాను రంగా అనుచరుడిగా పేర్కొంటున్న జోగి...

దుర్గ గుడిలో సత్య ప్రమాణం చేసిన అనంతరం జోగి రమేష్ మీడియాతో మాట్లాడుతూ తనను అరెస్టు చేస్తే రంగా అభిమానులు, గౌడ సామాజిక వర్గం నేతలు ఊరుకోరంటూ దర్యాప్తు సంస్థలకు హెచ్చరికలు జారీ చేశాడు. 1970 జనవరి నెలలో జోగి రమేష్ పుట్టినట్లు ఆయన నామినేషన్ వేసిన దస్త్రాలలో సమర్పించిన సర్టిఫికేట్లను బట్టి తెలుస్తోంది. 1988 డిశంబర్ లో వంగవీటి మోహన రంగా మరణించారు. వంగవీటి మోహనరంగా మరణించే సమయానికి జోగి రమేష్ కు 18 సంవత్సరాల వయసు మాత్రమే ఉంటుంది. రాజకీయంగా క్రియాశీలకంగా ఉండే వయసు అది కాదు అనే విషయం అందరికీ తెలుసిందే. వంగవీటి మోహన రంగా మరణించే సమయానికి కనీసం ఓటు హక్కు కూడా రాని వయసులో ఉన్న జోగి రమేష్ తాను రాధా, రంగా అనుచరుడిని అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అనుచరుడు అంటే ఒక నాయకుడి రాజకీయ కార్యనిర్వహణ వ్యవహారాలకు సంభందించి క్షేత్రస్థాయిలో నాయకుడి ఆలోచనలను, రాజకీయ కార్య కలాపాలను క్షేత్రస్థాయిలో ఆచరణ చేసి చూపించే సమకాలీన రాజకీయ వయస్కుడు. కానీ వంగవీటి మోహన రంగా మరణించే సమయానికి జోగి రమేష్ కి రాజకీయంగా క్రియ శీలంగా ఉండే అవకాశం లేదనేది సుస్పష్టం. అయినా తాను రాధా రంగా అనుచరుడిని అని చెప్పుకోవడం ప్రజలను మభ్యపెట్టడమే అవుతుందనే వాధనలు లేక పోలేదు. దుర్గ గుడి ఆలయంలో సత్య ప్రమాణం చేసిన సమయంలో తనను అరెస్ట్ చేస్తే రంగా అభిమానులు ఊరుకోరని చెప్పిన జోగి రమేష్ వంగవీగి రాధా వర్ధంతిని పట్టించుకోకపోవడం కొసమెరుపు. మంగళవారం నాడు వంగవీటి మోహనరంగా సోదరుడు వంగవీటి రాధా వర్ధంతి అయినప్పటికీ నిజంగా జోగి రమేష్ వంగవీటి రాధకు వర్ధంతి నివాళుల కార్యక్రమాలు జరపలేదు. కనీసం వంగవీటి రాధ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించినట్లు మీడియాకు ఫోటోలు, ప్రకటన విడుదల చేయలేదంటూ మైలవరం నియోజకవర్గం రాధా రంగా అభిమానులు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నలు సంధిస్తున్నారు. జోగి రమేష్ క్రియాశీలక రాజకీయాలలోకి వచ్చిన దగ్గర నుండి కాపు సామాజిక వర్గానికి చెందిన ఏ ఒక్క వ్యక్తిని కూడా రాజకీయాల్లో ఉన్నత పదవులలో కూర్చోబెట్టడానికి జోగి రమేష్ ఏనాడూ ఆసక్తిని ప్రదర్శించలేదు. గత దశాబ్ద కాలం క్రితం జోగి రమేష్ చెప్పే వంగవీటి మోహనరంగా కు సమీప బంధువు, మైలవర్గం నియోజక వర్గంలోని మాస్ లీడర్ స్వర్గీయ సింగలూరు శ్రీనివాసరావు అలియాస్ రాంపండు సోదరుడు సింగలూరి కేదారేశ్వరరావు (చంటి) ఇబ్రహీంపట్నం గ్రామ పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసినప్పుడు కూడా ఆయన విజయం కోసం జోగి కుటుంబం ఏ మాత్రం సహకారం అందించలేదనే ఆరోపణలు కూడా లేకపోలేదు. దీనిని బట్టి చూస్తే కాపు సామాజిక వర్గ అభివృద్ధిపై జోగికి ఉన్న చిత్తశుద్ధి నేతిబీరకాయలోని నెయ్యి వంటిదేనని పలువురు రాధా రంగా అభిమానులు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు.

### సొంత సామాజిక వర్గానికి సున్నం కొట్టిన జోగి....

తనను అరెస్టు చేస్తే గౌడ సామాజిక వర్గం నేతలు ఊరుకోరంటూ మీడియా సాక్షిగా దర్యాప్తు సంస్థలకు జోగి రమేష్ హెచ్చరికలు జారీ చేశాడు. ఇటీవల కాలంలో మైలవరం నియోజక వర్గంలో జోగి రమేష్ సొంత సామాజిక వర్గానికి చెందిన ఒక వ్యక్తి సోషల్ మీడియా వేదికగా జోగి పైన విమర్శలు గుప్పించారు. జి.కొండూరుకు చెందిన గౌడ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ట్రాన్స్ కో లో కాంట్రాక్ట్ పద్దతిలో ఉద్యోగం ఇప్పించాలని జోగి రమేష్ మంత్రిగా ఉన్న సమయంలో ఆయన వద్దకు వెళ్లగా ఆయన తన వద్ద మూడు లక్షలు తన వద్ద తీసుకున్నారని, అయితే చివరకు డబ్బులు తీసుకున్నాక కూడా ఉద్యోగం ఇప్పించకపోవడంతో వసంత కృష్ణ ప్రసాద్ తనకు ఉచితంగా వేరే చోట ఉద్యోగం ఇప్పించాడని అందులోని సారాంశం. ఇదిలా ఉండగా మైలవరం నియోజక వర్గంలోని గౌడ సామాజిక వర్గానికి చెందిన ఒక ప్రజా ప్రతినిది 2024 సార్వత్రిక ఎన్నికల్లో జోగి రమేష్ తనకు చాలా అన్యాయం చేశాడంటూ పార్టీ నేతల సమక్షంలోనే చాలా బాగా పొగడ్తలతో ముంచెత్తారని సమాచారం.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ మహాలక్ష్మి



## యాజమాన్యం నిర్లక్ష్యంతో క్వారీలో కార్మికుడి దుర్మరణం

**ఇబ్రహీంపట్నం రూరల్, అక్టోబర్ 28 (మనం న్యూస్)** మండలంలోని కాచవరం గ్రామానికి చెందిన ఉప్పుతల కృష్ణ (25) క్వారీ పని నిమిత్తం దొనబండ గ్రామ పరిధిలో ఆర్ పి ఆర్ క్వారీలో కొండ బ్లాస్టింగ్ కోసం పని చేస్తుండగా పై నుండి జారి పడి దుర్మరణం చెందాడు. విషయం తెలియగానే ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ జేటిపిటి దుర్గ మహాలక్ష్మి అక్కడకు వెళ్లి ఉప్పుతల కృష్ణ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబాని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## నిబంధనలకు విరుద్ధంగా క్వారీ నడుపుతున్న యాజమాన్యం.

ఇబ్రహీంపట్నం మండల పరిసర ప్రాంతాల్లో నడుస్తున్న కొండ క్వారీలు మృత్యు ఘంటికలు మోగిస్తున్నాయి. కొన్ని క్వారీల యాజమాన్యం నిలువెత్తు నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బాలైపోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా క్వారీలను నడుపుతూ నిత్య ప్రమాదాలతో మరణ మృదగం సృష్టిస్తున్నారు. ఒక ఘటన మరువక ముందే మరో ఘటన చోటు చేసుకోవడంతో స్థానికంగా భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని దొనబండ గ్రామ పరిధిలో నడుస్తున్న ఆర్.పిఆర్ క్వారీలో జరిగిన ప్రమాదంలో కాచవరం గ్రామానికి చెందిన 25 ఏళ్ల యువకుడు దుర్మారణం పాలయ్యాడు. కొండ బ్లాస్టింగ్ కోసం పని చేస్తుండగా పైనుండి జారి పడి మృతవాత పడ్డాడు. యువకుడు కాచవరం గ్రామానికి చెందిన ఉప్పుతల కృష్ణ (25) గా గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్వారీ లో కార్మిక చట్టాల ఉల్లంఘన

మండల పరిధిలో నడుస్తున్న కొండ క్వారీలో కార్మిక చట్టాల ఉల్లంఘన యదేచ్ఛగా జరుగుతోందని పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.. తుఫాన్ హెచ్చరికలు సైతం బేఖాతరు చేస్తూ ఆర్ పి ఆర్ క్వారీ యాజమాన్యం సోమవారం రోజున పనులు చేయించారు. తుఫాను రోజు పనులు ప్రారంభించకుండా ఉండి ఉంటే యువకుడు ప్రాణం నిలబడేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువకుడు మరణానికి కారణమైన ఆర్పిఆర్ క్వారీ యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. యువకుడు కుటుంబానికి ప్రభుత్వం అధికార యంత్రాంగం అండగా నిలబడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దొనబండ ఆర్ పీ ఆర్ కొండ క్వారీ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్ పి ఆర్ క్వారీలో కార్మిక చట్టాల ఉల్లంఘన జరుగుతోందని భద్రతా ప్రమాణాలు అమలు చేయడం లో విఫలమవుతున్నట్లు వాదనలు ఉన్నాయి. అసలు అనుమతులు లేకుండా క్వారీ నిర్వహణ ఎలా జరుగుతుందో అధికారులు నిగ్గు తెల్చాలని కార్మిక ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. యువకుడు మృతికి పూర్తిగా క్వారీ యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా తెలుస్తోందని సిఐటియు కార్మిక సంఘ నాయకుడు ఎం మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతి చెందిన యువకుడి మృతదేహాన్ని పరిశీలించిన ఆయన క్వారీ యాజమాన్యంపై మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్న క్వారీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని యువకుడు కుటుంబానికి 50 లక్షలు ప్రాణ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. యువకుడి మృతి పట్ల ప్రభుత్వం కూడా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కొండ క్వారీల అనుమతులను పునః పరిశీలన చేసి అనుమతులు లేని క్వారీలను మూసివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# పునరావస కేంద్రాలను తనిఖీ చేసిన పశ్చిమ ప్రత్తిపాటి శ్రీధర్



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 28 (మనం న్యూస్):** మొంథా తుఫాన్ నేపద్యంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో పశ్చిమలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ , కూటమినేతలతో కలిసి పరిశీలించారు.చిట్టినగర్ రాకేష్ పబ్లిక్ స్కూల్ , తేలప్రోలు రాజా హై స్కూల్, కొండ బడి తదితర ప్రాంతాలలో ఏర్పాటుచేసిన పునరావస కేంద్రాలను పరిశీలించి విశ్రాంతి తీసుకుంటున్న ప్రజలతో మాట్లాడారు.వారికి అందుతున్న వసతి సౌకర్యాలు, ఆహారం, త్రాగునీరు, మెడికల్ సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు.ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో ప్రభుత్వ యంత్రాంగం , ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది,సుజనా మిత్ర కోఆర్డినేటర్లు , కూటమి నేతలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారన్నారు. ఎటువంటి ఆస్తి ప్రాణ నష్టం సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.ఈ పర్యటనలో ఎన్డీఏ కూటమి నేతలు మైలవరపు దుర్గారావు ,మంగళపురి మహేష్, గడ్డిపాటి కిరణ్,వేంపలి గౌరీ శంకర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు ఆనంద్ కృపాల్, శ్రీనివాసరావు, సుజనా మిత్ర కోఆర్డినేటర్లు దొడ్ల రాజా, కొల్లి దుర్గారావు, తిరుపతి రెడ్డి, సప్పా శ్రీనివాస్, యలమంచిలి ఫణీంద్ర, పుప్పాల భవాని , శివకుమారి తదితరులు పాల్గొన్నారు..

# దుర్గ గుడిలో కార్తీక మాసం సందర్భంగా సహస్ర లింగార్చన, దీపార్చన సేవలు

**విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 28 (మనం న్యూస్):** కార్తిక మాసం సందర్భంగా మంగళవారం రాత్రి సహస్ర లింగార్చన, దీపార్చన సేవల యందు ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ పాల్గొన్నారు. ప్రతి రోజు ప్రదోష కాలములో మహా నివేదన, పంచ హారతులు, చతుర్వేద స్వస్తి జరుగుననని చైర్మన్ బొర్రా రాధాకృష్ణ తెలిపారు. భక్తులచే ప్రతి రోజు సాయంత్రం మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం వద్ద దీపోత్సవం (ఆర్జిత సేవ) జరుగునని ఆయన పేర్కొన్నారు. భక్తులు పాల్గొనవలసిందిగా మనవి చేశారు. తుఫాన్ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుండి తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొను వరకు దేవస్థానం టోల్ గేట్ ద్వారా రాకపోకలు పూర్తిగా నిలుపుదల చేయడమైనదని ఆయన ప్రకటించారు. భక్తులు రాకపోకలు కనకదుర్గ నగర్ ,మహా మండపం లిఫ్ట్ మార్గమున కొనసాగు విధముగా అన్ని చర్యలు తీసుకొనడం జరిగినది. తుపాను ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందుజాగ్రత్తలపై దేవస్థానం నుండి అప్రమత్తమై ఉన్నామని తెలియజేశారు.




# మొంథా తుపాను కొండ ప్రాంతాలను స్వయంగా పరిశీలించిన సీపీ



**విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 28 (మనం న్యూస్ )** విజయవాడ పశ్చిమ లో మొంథా తుపాను నేపథ్యంలో ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ, ఎక్కడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పూర్తి అప్రమత్తంగా ఉండేందుకు అన్నీ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన బంధోబస్త్ ఏర్పాటు చేయడం జరిగిందని నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిదిలోని కొండ చరియలు విరిగిపడేందుకు అవకాశమున్న కొండ ప్రాంతాలను పరిశీలించి అక్కడి ప్రజలకు మొంథా తుపాను నేపథ్యంలో ప్రజలు ఎటువంటి ప్రకృతి వైపరీత్య ప్రమాధాలకు గురికాకుండా ఉండాలనే సదుద్దేశంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు/ జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని సూచనలు చేశారు. ఈ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు మాట్లాడుతూ.మొంథా తుపాను నేపథ్యంలో ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ, ఎక్కడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా ఉండేందుకు సిబ్బంది అంధర్ని అప్రమత్తం చేసి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టడం జరిగింధని, ఎక్కడైనా వాగులు వంకలు పొంగినా వెంటనే డ్రోన్ కెమెరాల ద్వారా ఆ ప్రదేశాలను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సమస్య తీవ్రతను గమనిస్తూ అధికారులకు తెలియజేసే విధంగా చర్యలు చేపట్టినట్లు, అధెవిధంగా కొండ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడం జరుగుతుందని తెలియజేశారు. అన్నీ శాఖలను సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్.తోపాటు పశ్చిమ ఏ.సి.పి. దుర్గారావు టూ టౌన్ ఇన్స్పెక్టర్ చిన్న కొండల రావు ఒన్ టౌన్ ఇన్స్పెక్టర్ గురు ప్రకాష్ ఎస్.బి.ఇన్స్పెక్టర్ డి.వి.రమణ ఇన్స్పెక్టర్ గుణరామ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# 36వ బుక్ ఎగ్జిబిషన్‌కు సీఎంకు ఆహ్వానం



**విజయవాడ సెంట్రల్ అక్టోబర్ 28 (మనం న్యూస్):** దక్షిణ భారత దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే విజయవాడ బుక్ ఎగ్జిబిషన్కు హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆహ్వానించింది. 2026 జనవరి 2 తేదీన విజయవాడలో నిర్వహించనున్న ఈ 36వ బుక్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి హాజరు కావాల్సిందిగా సొసైటీ అధ్యక్షుడు టి.మనోహర్ నాయుడు, ఏపీ ప్రింటర్లు, పబ్లిషర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కాట్రగడ్డ మోహన్ సీఎంను ఆహ్వానించారు. వచ్చే ఏడాది జనవరి 2 నుంచి 7 తేదీ వరకు బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు బుక్ ఫెస్టివల్ సొసైటీ పేర్కొంది. దక్షిణ భారత దేశంలోని పుస్తక పబ్లిషర్లు, ప్రింటర్లు, పాఠకులు పెద్దఎత్తున హాజరు కానున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. అందరిలో పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగేలా బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించటంపై బుక్ ఫెస్టివల్ సొసైటీని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు.

# మొంథా తుఫాను ప్రవేశ ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి



**విజయవాడ సెంట్రల్ అక్టోబర్ 2 (మనం న్యూస్)** మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి. ప్రజలను అప్రమత్తం చేసే కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలి. రాజకీయాలకు అతీతంగా మన వంతు సహాయక చర్యలు చేపట్టాలి. ప్రజలను పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలించే విషయంలో ముందు నిలవాలని, ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని , ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నా.

# సీఎం చంద్రబాబును కలిసిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ



**విజయవాడ సెంట్రల్, అక్టోబర్ 28 (మనం న్యూస్)** ముఖ్యమంత్రి నారా చంద్రబాబుని మంగళవారం ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన ఆమె పలు అంశాలపై వారితో చర్చించారు. మహిళా సాధికారత దిశగా కమిషన్ భవిష్యత్ ప్రణాళికను సీఎంకు వివరించారు. అదేవిధంగా మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్త చర్యల్లో భాగంగా గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించి.. వారికి వైద్యసాయం అందించడంలో ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధను మహిళా కమిషన్ తరఫున ఆమె సీఎంకు ధన్యవాదాలు తెలియజేశారు. చైర్ పర్సన్ గా పదవిలోకి వచ్చిన అనతికాలంలోనే మహిళా కమిషన్ కు మంచిపేరు తెచ్చిన రాయపాటి శైలజ ను సీఎం చంద్రబాబు అభినందించారు.

## సామాజిక మాధ్యమాల వేదికగా అసత్య ప్రచారాలను ప్రచురిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు


### కృష్ణజిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్.,

**మచిలీపట్నం అక్టోబర్ 28 (మనం న్యూస్ ):** మొంథా తుఫాన్ నేపథ్యంలో పోలీస్,రెవెన్యూ, మరియు ఆయా శాఖలన్నీ సమన్వయంతో కృషి చేస్తూ ఎక్కడ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టానికి ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టడం జరిగింది. ఇప్పటికే అనేకమంది ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారిని సురక్షితంగా ఉంచడం జరిగింది. అలాగే వారికి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా వైద్య సదుపాయం అందజేయడం జరిగింది.అయితే కొన్ని ప్రదేశాలలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా గతంలో జరిగిన సంఘటనలకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు, అసత్య ప్రచారాలను సామాజిక మాధ్యమాల వేదికగా ప్రస్తుతం జరిగిన ప్రమాదాలు గా సృష్టించి, యూట్యూబ్ ఛానల్స్ నందు తంబ్ నెయిల్స్ గా తయారుచేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అలా ఎవరైనా వాస్తవ సమాచారాన్ని కాక అవాస్తవమైన, నిరాదారమైన ఆరోపణలతో కూడిన సమాచారాన్ని, అసత్య ప్రచారాలను ప్రచురితం చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు.అదేవిధంగా పునరావాస కేంద్రాల వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహారిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాం. పునరావస కేంద్రాల వద్ద ఏవైనా అసౌకర్యం ఉన్నట్లయితే అక్కడ ఆయా శాఖలకు సంబంధించిన సిబ్బందితో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగింది కనుక ఏదైనా సమాచారం ఉంటే మా దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించగలం.తుఫాను తీరం దాటడం కారణంగా విస్తారంగా గాలులు వీచి వర్షాలు పడేందుకు ఆస్కారం ఉన్న నేపథ్యంలో రహదారులపై చెట్లు కూలడం, విద్యుత్ వైర్లు తెగి రోడ్లపై పడడం కారణంగా అనుకోని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. కావున ప్రజలందరూ పోలీసువారి సూచనలను పాటిస్తూ ఎవరి ఇళ్లల్లో వారు సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాము.



## తుపాను సహాయక చర్యలను పరిశీలించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పి సిసోడియా

**విజయవాడ సెంట్రల్, అక్టోబర్ 28 (మనం న్యూస్)** మంగళవారం రాత్రి ఎన్టీఆర్ కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో తుపాను సహాయక చర్యలను స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పి సిసోడియా పరిశీలించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మిశ, జెసి ఇళక్కియ,విఎంసి కమిషనర్ ధ్యాన చంద్రలను అడిగి ఆయన వివరాలు తెలుసుకున్నారు. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో కలెక్టర్ లక్ష్మీశా తుఫాను సహాయక చర్యలు కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు.




## అద్వికా ట్రేడింగ్ మార్కెటింగ్ కంపెనీ చీటింగ్ కేసు లో ప్రధాన నిందితుల అరెస్టు

### 140 కోట్లు నష్ఠపోయిన సుమారు 1139 మంది డిపాజిటర్స్.

### ప్రధాన నింధితుడు, అతని భార్య కు సహకరించిన 2 ఏజెంట్స్ అరెస్టు.





**విజయవాడ సెంట్రల్, అక్టోబర్ 28 (మనం న్యూస్):** ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా వంద కోట్లకు పైమాటే డిపాజిటర్ల సొమ్మును కాజేసి డిపాజిటర్లకు కుచ్చుటోపి పెట్టారు అద్వికా ట్రేడింగ్ మార్కెటింగ్ కంపెనీ పేరుతో నయా మోసగాళ్లు. కొంతమంది కూతురు పెళ్లి కోసమని, కొంతమంది సొంత ఇల్లు కట్టుకునేందుకు, మరి కొంతమంది ఉద్యోగ విరమణ తరువాత ఈ మొత్తం వస్తే తనకు చేదోడుగా ఉంటుందనే నమ్మకంతో పెద్ద మొత్తంలో నగదును జమ చేశారు. కానీ కేటు గాళ్లు డిపాజిటర్ల నమ్మకాన్ని క్యాష్ చేసుకోవాలనే పక్కా ప్లాన్ తో నూట నలబై కోట్ల రూపాయలతో ఉడాయించారు. ఊరికే వచ్చిన సొమ్ము కాదు కదా... రూపాయి రూపాయి కూడబెట్టుకున్న డబ్బు అది. ఆ డబ్బు పోయిందనే వార్త వింటేనే గుండె ఆగినంత పని అయింది డిపాజిటర్లకు. ఎటూ డబ్బు కాజేశారని ఊరుకుంటే ఎలా ..? పోలీసులకు పిర్యాదు చేస్తే తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో ఒక వ్యక్తి ఇచ్చిన పిర్యాదుతో మోసగాళ్ల గుట్టు రట్టయింది. ఈ ఏడాది జూన్ 26 న సాయంత్రం వీరమల్లు గణేష్ చంద్ర తను, తన కుటుంబ సభ్యులు చేసిన పిర్యాదు ప్రకారం ముద్దాయి తాడేపల్లి ఆదిత్యకు చెందిన అద్వికా ట్రేడింగ్ కంపెనీలో ఆదిత్య మోసపూరిత మాటలు నమ్మి 53 లక్షలు డిపాజిట్ చేసినట్లు, దానికి గాను తిరిగి 13 లక్షలు ఇచ్చి కంపెనీ క్లోజ్ చేసి పారిపోయినట్లుగా ఇచ్చిన రిపోర్ట్ పై మాచవరం పోలీసు స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 248/2025 యు/ఎస్ 318(4), 316(2), 316(5), 61(2) బిఎన్ ఎస్, ఎపి ఫైనాన్షియల్ ఎష్టాబ్లిష్ మెంట్ యాక్ట్ 1999 లోని సెక్షన్ 5 ప్రకారం డిపాజిటర్ల రక్షణ చట్టం క్రింద మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు ప్రారంభించారు. సదరు కేసులో బాదితుల సంఖ్య సుమారు 1355 మంది ఉన్నారు. దీంతో ఈ కేసుని తీవ్రంగా పరిగణించిన నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు ఈ కేసును క్రైమ్ డి.సి.పి. డాక్టర్ కె.తిరుమలేశ్వర రెడ్డి ఆద్వర్యం లో సెంట్రల్ ఏ.సి.పి. కె దామోదర రావు దర్యాప్తులో టాస్క్ ఫోర్స్ ఏసిపి లత కుమారి తమ సిబ్బంది, 10 ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పటు చేసి దర్యాప్తు చేయించారు. దీంతో నిందితులను పక్కా ప్లాన్ తో స్కెచ్ వేసి పట్టుకున్నారు. దర్యాప్తులో భాగంగా 10 ప్రత్యేక బృందాలు ఈ కేసులో నష్ఠపోయిన బాదితులు సుమారు 1355 మందిని విచారించారు. ప్రధమ ముద్దాయి ఆదిత్య, మిగిలిన ముద్దాయిల బ్యాంక్ స్టేట్మెంట్ లను కూడా పోలీసులు సేకరించారు. టెక్నికల్ సాక్షాలను కూడా సేకరించారు. సోమవారం నాడు పోలీసు ప్రత్యేక బృందాలకు రాబడిన పక్కా సమాచారం మేరకు సెంట్రల్ ఏ.సి.పి. కె దామోదర రావు తన సిబ్బందితో కలిసి బల్లెం వారి వీధిలో శ్రీ లక్ష్మి ఎంక్లేవ్ అపాట్మెంట్ వద్ద ఎ1 నుండి ఎ4, ఏజెంట్స్ లను అదుపులోనికి తీసుకుని విచారించి అరెస్ట్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. కానూరు పంచాయితీ, విజయవాడకు చెందిన తాడేపల్లి శ్రీ వెంకట ఆదిత్య ఇతని భార్య తాడేపల్లి అలియాస్ గంట సుజాత లతో పాటు మరో ఇద్దరు ఏజెంట్లను పోలీసులు అరెస్టు చేశారు. ఎ 1 ఆదిత్య, అతని భార్య సుజాత 2022 వ సంవత్సరం లో అద్వికా ట్రేడింగ్ కంపెనీ స్థాపించి రు15 లక్షలు పెట్టుబడి పెట్టి, దుబాయి లో ఉన్న కబానా అకౌంట్ ద్వారా ట్రేడింగ్ ప్రారంభించాడు. మొదట్లో పెద్దగా లాభాలు రాకపోయిన డబ్బులు సంపాదించాలన్న ఆశ తో అధిక లాభాల పేరుతో ఎ-1 ఆదిత్య, అతని భార్య ఎ-2, ఎ-3, ఎ-4 వరకు ఇతర ఏజెంట్ల సహాయంతో నెలకు 5శాతం వడ్డీ, ఎజెంట్లకు 3-4శాతం మోస పూరిత హామీ ఇచ్చి ప్రజల వద్ద నుండి అధిక మొత్తంలో డిపాజిట్స్ సేకరించారు. ట్రేడింగ్లో లాభాలు లేకపోయినా కొత్త డిపాజిటర్స్ కట్టిన డబ్బులతో పాత డిపాజిటర్స్ కు వడ్డీ చెల్లించాడు. 2023లో వార్షికోత్సవం నిర్వహించి మరిన్ని డిపాజిట్లు సేకరించాడు. డిపాజిట్స్ సేకరించడంలో కొంత మంది ఏజెంట్స్ లాభాపేక్ష పడి ఎ-1 కి సహకరించారు. తర్వాత నిధులను మల్టీ బ్యాంక్ గ్రూప్ అకౌంట్కి బదిలీ చేసి వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకున్నాడు. తన పేరున, తన భార్య పేరున చిరాస్తులు, బంగారం కొనుక్కున్నారు. ఏజెంట్స్ కూడా వారి పేరున ఆస్తులు కొన్నారు. విచారణలో 2022 నుండి ఇప్పటి వరకు అద్వికా ట్రేడింగ్ కంపెనీ అధిక లాభాల ఆశ చూపి ప్రజలను మభ్యపెట్టి సుమారు 1450 మంది వద్ద నుండి సుమారు రు 400 కోట్లు డిపాజిట్ లు సేకరించి దానిలో కొంత భాగాన్ని దుబాయి లో ఉన్న కబానా ట్రేడింగ్ ,మల్టీ బ్యాంకింగ్ ఫోరెక్స్ వంటి విదేశీ ప్లాట్ ఫారమ్లకు బదిలీ చేసినట్లు తేలింది. డబ్బులకు ఆశ పడి కొంతమంది ఏజెంట్స్ ప్రజల కు అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి డిపాజిట్స్ సేకరించడంలో సహకరించినారు. ఆన్లైన్ ట్రేడింగ్ లో సుమారు 14 కోట్లు లాస్ వచ్చిన కొత్తగా సేకరించిన డిపాజిట్స్ నే పాతవారికి వడ్డీ క్రింద ఇచ్చారు. డిపాజిట్ లలో సుమారు 4 కోట్ల రూపాయిలతో ఆదిత్య చేరస్తులు కొనుగోలు చేశాడు. డిపాజిట్స్ దారులకు వడ్డీ కట్టలేని స్థితికి వచ్చేసరికి పారిపోయినాడు. విచారణలో అద్వికా ట్రేడింగ్ కంపెనీలో మూసివేసే సమయానికి సుమారు 1450 మంది డిపాజిటర్స్, 60 మంది ఏజెంట్స్ ఉండగా వారిలో 1150 మంది డిపాజిటర్స్ నష్ఠపోయిన డబ్బులు సుమారు 135 కోట్లు, సుమారు 25 ఏజెంట్స్ నష్ట పోయింది. 9 కోట్లు, మొత్తం 144 కోట్లు ఆదిత్య, అతని భార్య వారికి సహకరించినట్లుగా విచారణలో తెలినది. ఈ కేసు లో ముద్దాయిల యొక్క సుమారు 100 కోట్ల విలువైన చిరాస్తులను పోలీసులు గుర్తించారు.. ఎ1, ఎ2 ల అరెస్టు సంధర్భంలో వారి వద్ద నుండి రు.23 లక్షలు నగదు, 580 గ్రాముల బంగారం వస్తువులు, 8.3 కెజిల వెండి వస్తువులు, టాటా సఫారి కారు, కంప్యూటర్లు స్వాధీనం చేసుకోవడం జరిగినది. ఈ కేసు విచారణలో కృషి చేసినటువంటి సెంట్రల్ ఏసిపి కె. దామోదర రావు, టాస్క్ ఫోర్స్ కె.లత కుమారి , ఇన్స్పెక్టర్ లు ఎ.సుబ్రహ్మణ్యం మిగిలిన పోలీసులను సిపి రాజశేఖరబాబు అభినందించారు.

## దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి

**విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 28 (మనం న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యదర్శి ఐఏఎస్ ప్రద్యుమ్న సతీసమేతంగా, తమ కుటుంబసభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ప్రద్యుమ్న కుటుంబానికి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) వి కె శీనానాయక్ స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో వారిని ఘనంగా సత్కరించారు. ఈవో శీనా నాయక్, ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను ఆలయ ఈవో అందజేసి అన్నారు

